క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏపీఓ అప్పలనాయుడు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆ పథకం ఏపీఓ అప్పలనాయుడు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం వస్తుందని చెప్పారు. పని ప్రదేశంలో వేతనదారులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని, విశ్రాంతి తీసుకోవడానికి టెంట్లు ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్ ప్రారంభం



జెండా ఊపి క్రాస్ ప్రోగ్రామ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ జ్ఞాన దీపిక

గజపతినగరం రూరల్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్ ద్వారా గ్రామాల్లో హ్యాండ్ బోర్లకు మరమ్మతులు చేయించనున్నామని ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్ వాహనాన్ని గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 28 పంచాయతీల్లో పాడైన హ్యాండ్ బోర్లకు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీడీఓ కల్యాణి, మండల పరిషత్ కార్యాలయ ఏఓ పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

భవితలో ఫిజియోథెరపీ సేవలు



ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్ట్ హిమబిందు

గజపతినగరం: స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపిస్ట్ హిమబిందు గురువారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. పుట్టుకతో అంగవైకల్యం ఉన్న పిల్లలకు ఫిజియోథెరపీ చేయడం ద్వారా వారిలో కొంతమేరకు వైకల్యాన్ని తగ్గించవచ్చని ఆమె అన్నారు. భవిత కేంద్రంలో ప్రతీ గురువారం ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నామని, ప్రత్యేక అవసరాల పిల్లలను కేంద్రానికి తీసుకువచ్చిసేవలు వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐఈఆర్‌టీలు సత్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓలు చంద్రశేఖర్, ధర్మశ్రీను

మెరకముడిదాం: ఈనెల 17వ తేదీన ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓలు చంద్రశేఖర్, ధర్మశ్రీను తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో మూడు కేంద్రాల్లో 633 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు.మెరకముడిదాం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 260 మంది, గర్భాం హైస్కూల్‌లో 168 మంది రెగ్యులర్ విద్యార్థులు, ఆరుగురు ప్రైవేటు విద్యార్థులు, గర్భాం మోడల్‌స్కూల్‌లో 199 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ కేంద్రాల్లో ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: మండలంలోని గొట్లాం ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈఈ ఆర్.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని కెరటాం, తమటాడ, గొల్లలపేట, బిల్లలవలస గ్రామాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఈకేవైసీ చేయించుకోండి

గంట్యాడ: రైస్ కార్డుదారులు తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలని సీఎస్‌డీటీ మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంకా ఈకేవైసీ చేయించుకోని వారి జాబితా వీఆర్ఓలు, డిజిటల్ అసిస్టెంట్లు, రేషన డీలర్ల దగ్గర ఉన్నాయని పేర్కొన్నారు. రైస్ కార్డులో ఉన్న సభ్యులు ఎక్కడా ఉన్నా సరే ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

గిరిజనుల జీవనాడి జీడి

- ఆశాజనకంగా జీడి సాగు
- మద్దతుకోరుతున్న గిరిజనం...
- పూతపై రైతుల ఆందోళన

ఎస్.కోట డివిజన్ పరిధిలో జీడి పంట సాగు విస్తీర్ణం వివరాలు..

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)
శృంగవరపుకోట	800
గంట్యాడ	130
జామి	25
లక్కవరపుకోట	04
వేపాడ	186
కొత్తవలస	681

శృంగవరపుకోట: ఏటా కొత్తగా పెట్టుబడులు పెట్టకుండా స్వల్పనిర్వహణ ఖర్చులతో ఆదాయం వచ్చేది పండ్ల తోటలపైనే. రైతాంగాన్ని ఆదుకునేవి పండ్ల తోటలే. ప్రధానంగా వేసవిలో ఆదాయాన్నిచ్చేవి జీడి, మామిడి, చింత తోటలు. తక్కువ పెట్టుబడులతో మంచి ఆదాయాన్ని ఇచ్చే వాణిజ్య పంట జీడి. జిల్లా వ్యాప్తంగా 65 వేలఎకరాల్లో జీడి తోటలు సాగవుతున్నాయి. ఇందులో గిరిజన ప్రాంతాల్లో సాగవుతున్న విస్తీర్ణమే ఎక్కువ. జిల్లాలో ఏడాదికేడాది జీడి విస్తీర్ణం పెరుగుతోంది. గతంలో ఐటీడీఏ పీఓగా పనిచేసిన ఆర్.పి.శిశోడియా పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించడంతో మన్యంలో జీడి సాగు విస్తీర్ణం పెరిగింది. 1986 నుంచి గిరిజన రైతులు జీడి తోటలు పెంచేలా ఐటీడీఏ కృషి చేస్తోంది. అటు మన్యంలో ఇటు మైదాన పాంతాల్లోనూ కొండలు, మెట్టు, పోడు భూముల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రధానంగా మన్యంలో జీడిసాగు ఎక్కువ ఉన్నప్పటికీ, ఐటీడీఏ పరిధిలో లేని మండలాల్లో ఉన్న కొండ ప్రాంతాల్లో నూ గిరిజన రైతుల జీవనాడిగా జీడి సాగవుతోంది. ప్రస్తుతం జీడిపూత ఆశాజనకంగా ఉంది. చెట్లు విరగకాసి కనిపిస్తున్నాయి. అయితే మంచు విపరీతంగా కురుస్తుండడంతో పూత మాడిపోయి రాలిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు కోసం ఎదురు చూపులు

ప్రస్తుతం జీడి పిక్కల ధర కిలో రూ.110 నుంచి రూ.120 వరకూ ఉంది. 80 కిలోల బస్తా ధర రూ.7,000 నుంచి రూ.8,000 పలుకుతోంది. కాగా సగటున బస్తాకు రూ.16,000 ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. దిగుబడి ఆశాజనకంగానే ఉన్నా, ఆశించిన మద్దతు ధర దక్కకపోవడం, ఏడాదంతా విదేశీ జీడిపప్పు దిగుమతి కావడం, ప్రతికూల వాతావరణం, చీడపీడలు జీడి రైతులను దెబ్బతీస్తున్నాయి. మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఏపీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేస్తున్నారు.



ఎస్.కోట ప్రాంతంలో జీడి తోటలు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రస్తుతం పంట పూత, పిందె దశలో ఉన్నందున చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు. రోజూ ఉదయాన్నే మంచుకురుస్తున్నందున జీడిపూత లోపల తేమ చేరి తామర పురుగు, లేదా తేయాకు దోమ ఉధృతి పెరిగే అవకాశం ఉంది. పూత విచ్చుకోక ముందు, ఫలదీకరణ తర్వాత, కాయలు గోలీల సైజులో ఉన్నప్పుడు మూడు దఫాలు మందు పిచికారీ చేయాలి. పూత చిగురుదశలో క్లోరిఫైరిఫాస్ 2 మిల్లీ లీటర్లు లేదా మోనోక్రోటోఫాస్ 1.5 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. రెండో దశ పూత పిందెగా మారుతున్న సమయంలో ల్యాండా సైహలోత్రిన్ మందును 0.6 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పండు దశలో క్వినైలోఫాస్ లేదా ప్రొఫెనోఫాస్ మందును 2 మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొడివాతావరణం ఉంటే బూడిద తెగులు ఆశించి పూతరాలిపోయే ప్రమాదం ఉంది. నివారణకు సల్ఫర్ 3 గ్రాములు లేదా ట్రైడేమోర్ఫ్1.5గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి. 80 కిలోల బస్తాకు మద్దతు ధర రూ.16,000 ఇవ్వాలి. పోడు వ్యవసాయాన్ని గణనలోకి తీసుకుని పంటల నమోదు, బీమా, రైతు రుణాలు, కొనుగోలు, చెల్లింపులు వంటి సౌకర్యాలను మైదాన ప్రాంతాల్లోని రైతుల మాదిరిగానే గిరిశిఖర గ్రామాల్లోని రైతాంగానికి కల్పించాలి.

– జరతా గౌరీష్, ఏపీ గిరిజన సంఘం కార్యదర్శి

ఆశాజనకంగా ఉంది



జిల్లాలో జీడిపంట ఆశాజనకంగా ఉంది. సస్యరక్షణ చర్యల వల్లే మంచి దిగుబడులు సాధ్యమవుతాయి. ప్రస్తుతం పగటి వేళ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నా తెల్లవారుజామున మంచు కురుస్తోంది. దీంతో టీ దోమ,బూడిద తెగులు, రసం పీల్చే పురుగులు కనిపిస్తున్నాయి. వీటి నివారణకు వెంటనే తగిన మందులు పిచికారీ చేయాలి.

– టి.అనిత, ఉద్యానవన శాఖాధికారి, ఎస్.కోట

పరీక్ష సామగ్రి వితరణ



చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న దాతలు,హెచ్‌ఎం



శృంగవరపుకోట: ధర్మవరంలో విద్యార్థులకు పరీక్షల కిట్ అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



వేపాడ: సోంపురం హైస్కూల్‌లో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్నహెచ్‌ఎం, దాతలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తాటిగూడ ఉన్నత పాఠశాలలోని 29 మంది పదోతరగతి విద్యార్థులకు దాతలు గురువారం పరీక్ష సామగ్రి అందజేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గంట్యాడ సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు గంట్యాడ పైడినాయుడు, శనపతి సన్యాసి, సంతోష్ ఆర్థిక సహాయంతో పరీక్ష సామగ్రి సమకూర్చామని హెచ్‌ఎం సత్యశ్రీనివాస్ చెప్పారు. దాతలకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మవరంలో...

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎస్.శివరామకృష్ణ అందజేశారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని రహీం షేక్ లాల్ తన తల్లి నూర్జహాన్ బేగం జ్ఞాపకార్థం 80 మంది విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు, ఎరైజర్లు, షార్ప్‌నర్లు, స్కేళ్లు తదితర సామగ్రి సమకూర్చారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సోంపురంలో...

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు దాతలు డాక్టర్ వి.ఎస్.కృష్ణ, పి.స్వామి నాయుడు, గ్రామ యువత సహకారంతో హెచ్ ఎం బి.పి.ఏ.రాజు ఆధ్వర్యంలో గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. అలాగే ప్రీఫైనల్ పరీక్షల్లో పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఎర్నమ్మ, శిరీష, రాకేష్‌కు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. డాక్టర్లు పి.కావ్య, పి.గౌతమ్, పి.రామునాయుడు, కె.కొండలరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవుపల్లిలో తాగునీటి ఇబ్బందులు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత అయిదు రోజులుగా కుళాయిల ద్వారా తాగునీటి సరాఫరా నిలిచి పోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి ఆనుకుని ఉన్న రక్షిత మంచినీటి పథకం మోటారు పాడవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీ వాసులు సమీపంలోని వ్యవసాయ బోర్లు, చేతి బోర్ల నుంచి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. సమస్యను పంచాయతీ కార్యదర్శి సత్యవతి వద్ద సాక్షి ప్రస్తావించగా రక్షిత మంచినీటి పథకం మోటారుకు మరమ్మతులు చేయించి శుక్రవారం తాగునీటి సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

బాధితులకు సహాయం



ఉత్తరావల్లి గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు విజయనగరం రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు ముడిదాపు రాము, సీహెచ్. మన్మథరావు బాధితులకు గురువారం నిత్యావసర సరుకులు, టార్పాలిన్లు, దుప్పట్లు అందజేశారు. ఆర్ఐ ఎస్.అరుణకుమారి, గ్రామపెద్ద మండల రమణ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు. –మెరకముడిదాం

గుర్రాల పరుగు పోటీలు



వెంకటరమణపేట గ్రామంలో ఎల్లారమ్మ తీర్థం సందర్భంగా గురువారం నిర్వహించిన గుర్రాల పరుగు పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. – శృంగవరపుకోట

ఒత్తిడిని అధిగమించాలి



పదోతరగతి విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. గుర్ల కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) గురువారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి, పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు అనగానే ఒత్తిడికి గురవుతుంటారని, ఈ ఒత్తిడిలో నేర్చుకున్నదంతా మర్చిపోతుంటారని అన్నారు. ఏడాదంతా చదివిన పాఠ్యాంశాల నుంచే పరీక్షల్లో ప్రశ్నలు వస్తాయని, ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలని చెప్పారు. పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట కేజీబీవీ ఎస్ఓ జానకి ఉన్నారు. – గుర్ల

పరీక్ష వేళ... పని..!

మెరకముడిదాం: పరీక్షలకు సమయం దగ్గరపడుతోంది సమయాన్ని వృథా చేయకుండా చదువుకోండి అని చెప్పాల్సిన ప్రధానోపాధ్యాయుడే విద్యార్థులతో పరీక్షల నిర్వహణ పనులు చేయించడంతో అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 17వ తేదీన ప్రారంభంకానున్నాయి. మెరకముడిదాం ఉన్నత పాఠశాలలో పరీక్షల నిర్వహణకు హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఇక్కడ పరీక్షల నిర్వహణకు అవసరమైన బెంచీలను గ్రామంలో ఉన్న కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) నుంచి విద్యార్థుల ద్వారా తరలించారు. హైస్కూల్ నుంచి కొంతమంది పదోతరగతి విద్యార్థులను ట్రాక్టర్‌లో కేజీబీవీకి పంపించారు. కేజీబీవీలో 24 బెంచీలను విద్యార్థులే ట్రాక్టర్‌కు ఎక్కించి హైస్కూల్‌కు తీసుకువచ్చారు. విద్యార్థులు ట్రాక్టర్‌పై బెంచీలను తరలిస్తుండగా కొంతమంది ఫొటోలు తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు.ఈ ఫొటోలు వైరల్ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇదే విషయాన్ని హెచ్‌ఎం కోట్ల ఎల్లంనాయుడు వద్ద సాక్షి ఫోన్‌లో ప్రస్తావించగా బెంచీలను ట్రాక్టర్‌లో ఎక్కించేటప్పుడు సహాయం చేయడానికి కొంత మంది విద్యార్థులను పంపించామని, ఇలాంటి విషయాలను అంతగా పట్టించుకోవాల్సిన పనిలేదని చెప్పడం గమనార్హం.ఎంఈఓ చంద్రశేఖర్ వద్ద ఈ విషయం ప్రస్తావించగా.. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, హెచ్‌ఎం ఎల్లంనాయుడుతో మాట్లాడానని చెప్పారు. విద్యార్థులు ట్రాక్టర్‌తో కేజీబీవీకి వెళ్లడం వాస్తవమే కానీ వారు కేవలం బెంచీలపై నంబర్లు వేయడానికే వెళ్లారని హెచ్‌ఎం వివరణ ఇచ్చారని ఎంఈఓ చెబుతున్నారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేకతరగతులు, స్టడీ అవర్లు నిర్వహించాలని చెబుతుంటే విద్యార్థులతో పనులు చేయించడమేంటని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.



ట్రాక్టర్‌పై బెంచీలను కేజీబీవీ నుంచి హైస్కూల్‌కు తరలిస్తున్న విద్యార్థులు

ఘనంగా మొల్లమాంబ జయంతి




గుర్ల: మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాలివాహన జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు , తదితరులు

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురం గ్రామంలో కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతిని శాలివాహన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి సంఘం పెద్దలు, జిల్లా శాలివాహన వెల్ఫేర్ కమిటీ కార్యదర్శి ఎస్.కనకారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రామాయణాన్ని తెలుగులో రచించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని తెలిపారు. ఆమె జయంతిని గత ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించిదని గుర్తు చేశారు. వార్డు మెంబర్ బుడుమూరు రాము, శాలివాహన సంఘం పెద్దలు వీరన్న, పరదేశిరాజు,శ్రీను, నర్సింహులు,సోములు పాల్గొన్నారు.

గుర్లలో...

గుర్ల: కవయిత్రి మొల్లమాంబ జయంతిని మండల కేంద్రంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి శాలివాహన జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాలి శ్రీనివాసరావు, సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ శాలివాహనులకు గుర్తింపు తెచ్చిన మహిళ మొల్లమాంబ అని, ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

పీ4 సర్వేను వేగవంతం చేయండి



బొండపల్లి: ముద్దూరులో రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

బొండపల్లి: గ్రామాల్లో పీ4 సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ జి.గిరిబాల సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలం లోని ముద్దూరు గ్రామ సచివాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందిని వివిధ అంశాలపై ఆరా తీశారు. సచివాలయం పరిధిలో పీ4 సర్వే ఎంతవరకు పూర్తయ్యిందో అడిగి తెలుసుకున్నారు.సర్వే పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఈనెల 18 వరకు గడువు ఇచ్చిందని, ఈలోగా శతశాతం పూర్తి చేయాలని చెప్పారు. అంతకుముందు గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా చేపడుతున్న రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలించారు.

త్వరగా పూర్తి చేయాలి

దత్తిరాజేరు: మండలంలో పీ4 సర్వేను త్వరగా పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆదేశించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 35 గ్రామ పంచాయతీల్లోని ఇంటింటికీ సచివాలయాల సిబ్బంది వెళ్లి సర్వే చేయాలని చెప్పారు. ప్రభుత్వం సూచించిన సమాచారాన్ని సర్వేలో సేకరించాలని సూచించారు.

బాలికలకు విద్య, క్రీడా సామగ్రి పంపిణీ



నాంది ఫౌండేషన్ అందించిన కిట్‌లతో ఎల్.కోట మోడల్ స్కూల్ విద్యార్థినులు

వేపాడ/లక్కవరపుకోట: బాలికల విద్య, క్రీడాభివృద్ధికి విశాఖపట్నానికి చెందిన నాంది ఫౌండేషన్ 'నన్హి కాళీ' ప్రాజెక్టు ద్వారా చేస్తున్న కృషి అభినందనీయమని వేపాడ మండలంలోని బక్కునాయుడుపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు, ఎల్.కోట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఓలేటి ప్రకాష్‌రావు అన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థినులకు 'నన్హి కాళీ' ప్రాజెక్టు సభ్యులు గురువారం బూట్లు,సాక్సులు,నోట్ పుస్తకాకాలు,టీషర్టులు,బ్యాగ్‌లు, న్యాప్కిన్లు, తదితర సామగ్రితో కూడిన కిట్లు అందజేశారు. నన్హి కాళీ' ప్రాజెక్టు సభ్యులు అనూరాధ, చాయాదేవి, కోళ్ల శ్రావణికి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో 55 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8,175 మంది విద్యార్థినులకు ఈ కిట్‌లు అందజేస్తున్నామని నన్హి కాళీ' ప్రాజెక్టు సభ్యులు తెలిపారు.



వేపాడ: బక్కునాయుడుపేట మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు కిట్‌లు అందచేస్తున్న నాంది ఫౌండేషన్ సభ్యులు